రేపు హెచ్‌సీఎస్‌సీ సమ్మిట్ 2024

పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) సమ్మిట్ -2024, నవంబర్ 6న పార్కు హోటల్‌లో నిర్వహిస్తున్నట్టు హెచ్‌సీఎస్‌సీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర పోలీసు అధికారులు, హెచ్‌సీఎస్‌సీ ప్రతినిధులతో కలిసి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నేటి నుంచి హెల్మెట్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): గోషామహల్ అలస్క జంక్షన్‌లో 1వ తేదీన డీసీఎం ఢీకొని ఒక వ్యక్తి, 2వ తేదీన తార్నాకలో ఆర్టీసీ బస్ కిందపడి ఒక మహిళ, 3వ తేదీ రాత్రి ఎన్టీఆర్ మార్గ్‌లో రాంగ్ రూట్‌లో వస్తూ కారు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన వారికి హెల్మెట్ లేదని, హెల్మెట్ ఉంటే ప్రాణాలతో బయటపడేవారని నగర అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం నుంచి హెల్మెట్ లేని ప్రయాణం, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విశ్వప్రసాద్ తెలిపారు. హెల్మెట్ లేని వారికి రూ. 200, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు రూ. 2 వేల జరిమానా విధిస్తామని అదనపు సీపీ తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అదనపు సీపీ సూచించారు.

ట్రాయ్ పేరుతో బెదిరించి..

రూ.1.37 కోట్లు దోచుకున్న సైబర్‌మోసగాడి అరెస్ట్

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): మీ ఆధార్ కార్డుతో లింక్ ఉన్న సిమ్‌కార్డ్ ద్వారా మనీ లాండరింగ్ జరిగిందంటూ బెదిరించి.. 67 ఏండ్ల వృద్ధుడి వద్ద నుంచి రూ.1.37 కోట్లు దోచుకున్న సైబర్ నేరగాడిని సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. సెప్టెంబర్ 21న నగరానికి చెందిన 67 ఏండ్ల వృద్ధుడికి గుర్తుతెలియన ఓ వ్యక్తి నుంచి ఆటోమేటెడ్ కాల్ వచ్చింది. తాము ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ ఆధార్ కార్డ్‌తో లింకైన సిమ్ కార్డు ద్వారా పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగింది.. దీంతో మీపై ముంబై క్రైమ్ బ్రాంచ్‌లో కేసు నమోదైంది.. అంటూ చెప్పారు. ఆ వెంటనే కాల్‌ను మరో వ్యక్తికి ఫార్వార్డ్ చేశాడు. సదరు వ్యక్తి తనను తాను ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన పోలీసు అధికారిగా పరిచయం చేసుకున్నాడు. మీ పేరుతో ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఖాతా తెరవడంతో పాటు పెద్ద ఎత్తున అంతర్జాతీయ స్థాయి మనీలాండరింగ్ జరిగినట్లు బెదిరించాడు. విచారణ నిమిత్తం వెంటనే తాము సూచించిన సీబీఐ ఖాతాలో రూ.1.37 కోట్లు డిపాజిట్ చేయాలని చెప్పాడు. ఈ క్రమంలో బాధితుడిని పూర్తిగా డిజిటల్ అరెస్ట్ చేసి.. అతడితో రూ.1.37 కోట్లు ఆన్‌లైన్ ద్వారా తమ ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, సైబర్ నేరానికి సహకరించిన సురేశ్ కుమార్ బాబూలాల్‌ను సోమవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

పెట్టుబడి పేరుతో..

మరో కేసులో.. పెట్టుబడుల పేరుతో అమాయక ప్రజలను మోసగించి రూ.57.66 లక్షలు దోచుకున్న ఇద్దరిని సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. సోచన్, కేరళకు చెందిన శరత్, యదుకృష్ణన్ కలిసి అలియన్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ పేరుతో పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నారు. తమ వద్ద పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో అధిక రాబడి వస్తుందని, తొలుత కొన్ని రోజులు రాబడి చెల్లిస్తూ నమ్మించారు. ఆ తరువాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టించి.. కోట్ల రూపాయలు దోచుకున్నారు. ఈ క్రమంలోనే నగరానికి చెందిన ఒక వ్యక్తిని పెట్టుబడి పేరుతో నమ్మించి రూ.57.66 లక్షలు మోసగించారు. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన సైబర్‌క్రైమ్ పోలీసులు.. కేసు నమోదు చేసుకుని శరత్, యదుకృష్ణన్‌ను సోమవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రౌడీషీటర్లతో ఖాకీల దోస్తీ!

కొన్ని ఠాణాల్లో రౌడీలతో ఫ్రెండ్లీ పోలీస్

- బాలానగర్‌లో 30 మంది అనుచరులతో రౌడీ గ్యాంగ్
- మామూళ్లతో క్షేత్ర స్థాయి సిబ్బందితో దోస్తీ
- బాధితులు ఫిర్యాదు చేస్తే.. ఠాణా నుంచి సమాచారం లీక్
- నా కత్తికి పనిచెప్పమంటవా.. అంటూ బెదిరింపులు
- బాలానగర్ జోన్‌లో రౌడీషీటర్ ఆగడాలు

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): కత్తి పట్టే రౌడీలతో కొందరు ఖాకీలు దోస్తీ చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఉండే కొందరు పోలీసులు.. రౌడీలతో చట్టాపట్టాలేసుకుంటూ తిరగడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఉన్న కొంతమంది రౌడీషీటర్లు ఆదిపత్యం కోసం గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకొని.. ప్రతీకార దాడులు, హత్యలు చేస్తున్న ఘటనలు ఇటీవల తరచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. పండుగలు, వేడుకల సమయంలోనే రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. దీంతో కొంతమంది రౌడీషీటర్లు తమ మైండ్‌సెట్‌ను మార్చుకొని.. సత్ ప్రవర్తనతో నడుచుకుంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి.. వారిపై ఉన్న రౌడీషీట్‌ను పోలీసులు ఎత్తివేస్తున్నారు. ప్రవర్తన మార్చుకొని రౌడీషీట్లను కొనసాగిస్తూ.. నేరాలకు పాల్పడుతున్న వారిపై కొత్తగా కూడా రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారు.

పోలీస్ దోస్తీ..

కొన్ని ప్రాంతాల్లోని కొంతమంది రౌడీషీటర్లు క్షేత్ర స్థాయిలో ఉండే పోలీసు సిబ్బందితో స్నేహంగా ఉంటూ.. స్థానికంగా తమ పట్టు కొనసాగిస్తున్నారు. దీంతో రౌడీషీటర్లు వారికి కావాల్సిన చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారు. ఇందుకు ప్రతిఫలంగా.. క్షేత్ర స్థాయిలో ఉండే పోలీసులను ఆర్థిక సహకారంతో పాటు, విందు, పొందుతో మెప్పిస్తున్నారు. కొన్ని ఠాణాల పరిధిలో క్షేత్ర స్థాయిలో పనిచేసే పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, బీట్ కానిస్టేబుల్, ఆయా ఠాణాల పరిధిలో ఉండే ఎస్‌ఓటీ, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్, ఎస్సై స్థాయి అధికారులు కూడా రౌడీషీటర్లతో దోస్తీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసుల దోస్తీని అవకాశంగా తీసుకుంటున్న రౌడీషీటర్లు.. సామాన్య ప్రజలను వేధిస్తున్నారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.. బాలానగర్ జోన్‌లో ఉన్న ఒక రౌడీషీటర్ 30 మందితో ఒక గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి హంగామా చేస్తున్నాడని అక్కడి ప్రజలు తెలిపారు.

ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు.!

బాలానగర్ జోన్‌లో గతంలో ఓ నాయకుడిని హత్య చేసి, జైలుకు వెళ్లి వచ్చిన రౌడీషీటర్, మరో హత్యా యత్నానికి పాల్పడ్డాడు. సెటిల్‌మెంట్ వివాదంలో ఓ వ్యక్తి గొంతు నరాన్ని కోశాడు. బాధితుడు పక్షవాతానికి గురయ్యాడు. దీంతో బాధితుడి కుటుంబం రోడ్డున పడింది. ఇలాంటి నేరాలకు పాల్పడటంతో ఆ ప్రాంత ప్రజల్లో ఈ రౌడీషీటర్ అంటే భయం మొదలయ్యింది. ప్రజలను భయపెట్టేందుకు అతడు 30 మందితో ఓ గ్యాంగ్‌ను తయారు చేసుకున్నాడు. ఈ గ్యాంగ్‌తో అటూ సైబరాబాద్, ఇటూ హైదరాబాద్ కమిషనరేట్ల పరిధిలోని క్షేత్ర స్థాయిలో ఉండే పోలీసు సిబ్బందితో దోస్తీ చేస్తున్నాడు. పోలీసుల సహకారం ఉండటంతో అనుకున్నది సాధిస్తున్నాడు. ఈ రౌడీషీటర్‌పై హత్య, హత్యాయత్నం, దోపిడీ, దొంగతనానికి సంబంధించిన కేసులున్నాయి. అయినా.. పోలీసులు పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.

జైలులో రౌడీలతో దోస్తీ..

ఈ రౌడీషీటర్ జైలుకు వెళ్లిన సమయంలో అక్కడున్న పాత రౌడీషీటర్లను దోస్తీ చేసుకున్నాడు. ఇలా ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఉన్న పలువురు రౌడీషీటర్లతో దోస్తీ చేసిన ఈ రౌడీషీటర్ నేర సామ్రాజ్యం నెమ్మదిగా ట్రై పోలీసు కమిషనరేట్ల పరిధిలో విస్తరించింది. ఇతడు తొలుత క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పోలీసులతో దోస్తీ చేసి వారికి కావాల్సిన మాముళ్లు ఇస్తూ.. ఇతడికి కావాల్సిన పనులు చేసుకుంటూ స్థానికంగా ఉండే ప్రజల్లో భయం పుట్టిస్తున్నాడు. కిందస్థాయి పోలీసు సిబ్బంది సహాయంతో కొంతమంది పెద్ద అధికారుల సహాయం కూడా తీసుకుంటూ పోలీసులతో మర్యాదలు అందుకుంటున్నాడని ప్రజలు చెబుతున్నారు.

ఫిర్యాదు చేస్తే.. వెంటనే లీక్.!

ఈ రౌడీషీటర్‌పై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే ఠాణా నుంచి ఆ సమాచారం రౌడీషీటర్‌కు చేరుతోంది. పోలీసులు కూడా రౌడీషీటర్‌కే మద్దతు పలుకుతున్నారని ప్రజలు చెబుతున్నారు. ఎవరైనా మాట వినకపోతే.. నా కత్తికి పని చెప్పమంటవా.? అంటూ బెదిరిస్తున్నాడని తెలిసింది. స్థానికంగా అక్రమ నిర్మాణాలపై ఎవరైనా జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేశారంటే చాలు.. ఈ రౌడీషీటర్ ఈజీగా ఆ సమస్యను పరిష్కరిస్తున్నాడు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్ చేసి.. మావాడి ఇల్లు కూల్చేస్తామని చెప్పారంటా.. అంటూ ప్రశ్నిస్తున్నాడు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను తెలుసుకుంటున్నాడు. ఆ తర్వాత సదరు ఫిర్యాదుదారు ఫోన్‌నంబర్ తీసుకొని బెదిరిస్తున్నాడు. ఈ రౌడీషీటర్ వేధింపులు ఎక్కువయ్యాయని, స్థానిక పోలీసులు కూడా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

బండ్లగూడ, నవంబర్ 4: పరిశుభ్రత పాటించని హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లిలోని మజ్లిస్ కల్చర్, కాలిఫోర్నియా బర్రిట్టో హోటల్‌లో తనిఖీలు చేశారు. పాడైన ఆహార పదార్థాలు నిల్వ చేయడంతో పాటు కిచెన్ పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్నట్టు గుర్తించారు. కాలిఫోర్నియా బరిట్టో రెస్టారెంట్‌లో బొద్దెంకలు తిరుగుతున్నాయని అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కల్తీ పదార్థాలను వాడితే తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ హోటళ్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లైంగిక దాడి.. యువకుడి అరెస్ట్

హిమాయత్‌నగర్, నవంబర్ 4: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని సోమవారం నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. డీఐ నాగార్జున కథనం ప్రకారం.. బాలిక (17) నారాయణగూడలోని ఓ ప్రైవేట్ హాస్టల్ ఉంటూ.. డిగ్రీ చదువుతున్నది. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన పవన్ (22) చికెన్ సెంటర్‌లో పనిచేన్నాడు. రెండు నెలల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో పవన్‌కు బాధిత బాలికతో పరిచయం ఏర్పడింది. నిత్యం ఆ బాలికతో చాటింగ్ చేశాడు. ఆ తర్వాత ప్రేమిస్తున్నాను.. పెండ్లి చేసుకుంటానంటూ బాలిక వెంటపడుతూ వేధించాడు. గతనెల అక్టోబర్ 27న పవన్ నారాయణగూడకు వచ్చి బాలికను తీసుకువెళ్లాడు. కుటుంబసభ్యులు బాలికకు పలుమార్లు ఫోన్ చేసినా మాట్లాడక పోవడంతో అనుమానం వచ్చి.. హాస్టల్‌కు వచ్చి ఆరా తీశారు. హాస్టల్‌లో బాలిక లేదని హాస్టల్ నిర్వాహకులు చెప్పడంతో.. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి.. హాస్టల్ సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి.. ఓ యువకుడి బైక్‌పై బాలిక వెళ్లినట్టు గుర్తించారు. బైక్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే తీసుకువెళ్లానని ఒప్పుకున్నాడు. బాలికను పోలీసులు భరోసా సెంటర్‌కు తరలించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తనను మభ్యపెట్టి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తెలిపింది. పోక్సో చట్టం కింద అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. డీఎస్సై వెంకటేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల ఖాతా నుంచి రూ.1.05 కోట్లు వచ్చేశాయి

బాధితుడి ఖాతాలో జమ చేయించిన పోలీసులు

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరగాళ్లు నగరానికి చెందిన ఓ బాధితుడి నుంచి రూ.1.22 కోట్లు కొట్టేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులు.. సకాలంలో స్పందించి నేరగాళ్ల ఖాతా నుంచి తిరిగి రూ. 1.05 కోట్లు బాధితుడి ఖాతాలో జమ చేయించారంటూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. సైబర్‌నేరగాళ్లు బాధితుడికి ఫోన్ చేసి.. తాము ట్రేడింగ్‌లో అనుభవం ఉన్నవాళ్లమని, మేం చెప్పినట్టు చేస్తే మంచి లాభాలొస్తాయంటూ నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు.. నేరగాళ్లు చెప్పినట్టు 'లాజార్‌డో స్విప్, టాప్' చెందిన బ్యాంకు ఖాతాలలో దఫ దఫాలుగా రూ. 1,22,26,205 డిపాజిట్ చేశాడు. ఆ తరువాత అదంతా మోసమని తెలడంతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేపట్టింది. నిందితుల ఖాతాలను గుర్తించిన పోలీసులు.. ఆ ఖాతాల్లోని నగదును ఫ్రీజ్ చేయించారు. కోర్టు అనుమతితో ఆయా ఖాతాలలో ఉన్న రూ. 1,05,00,000 నగదును తిరిగి బాధితుడి ఖాతాలోకి రప్పించారని సీపీ తెలిపారు.

రాత్రి వేళల్లో ర్యాష్ డ్రైవింగ్..

అమాయకుల ప్రాణాలు గాల్లోకి.. స్పెషల్ డ్రైవ్‌లు ఎక్కడా!

సిటీబ్యూరో, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): నగరంలో ర్యాష్, నిర్లక్ష్యం డ్రైవింగ్ కేసులు పెరుగుతున్నాయి. రాత్రి వేళల్లో చోటు చేసుకుంటున్న ఈ ఘటనలతో నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌తో పాటు నెక్లెస్ రోడ్డు ప్రాంతాల్లో వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. వీటికి తోడు రోడ్లపై యువకులు విన్యాసాలు చేస్తూ సెల్ఫీలు తీసుకుంటున్నారు. రాత్రి 11 అయ్యిందంటే చాలు వాహనాల రేసింగ్ సౌండ్లతో రోడ్లన్నీ నిండిపోతున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లు ఖాళీ ఉండటం, దీనికి తోడు పోలీసులు కూడా లేకపోవడంతో ఇక అడ్డు అదుపు లేకుండా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. మూడు రోజుల కిందట కేబీఆర్ పార్కు వద్ద ర్యాష్ డ్రైవింగ్‌తో పార్కు గోడను ఢీకొట్టిన కారు ఘటన మరువక ముందే ఎన్టీఆర్ మార్గ్‌లో ఆదివారం రాత్రి మరో ఘటన జరిగింది. రాత్రి వేళల్లో యువకులు హల్‌చల్ చేస్తూ రోడ్లపై విన్యాసాలు చేస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు రాత్రి వేళల్లో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, అప్పుడే రోడ్లపై విన్యాసాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రజలంటున్నారు.

ఇతరులకు ఇబ్బందులు.!

ర్యాష్ డ్రైవింగ్‌తో అభం శుభం తెలియని పాదచారులు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. నెక్లెస్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారు ప్రమాదం బారిన పడ్డారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ ఘటనలతో వాహనం నడిపే వారి కంటే.. ఇతరులే ఎక్కువ సంఖ్యలో ప్రమాదానికి గురవుతున్నారు. తప్పు చేస్తున్న వారికంటే.. అమాయకులే ఎక్కువ సంఖ్యలో ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు గతంలో రాత్రి సమయంలో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారని, ఇటీవల ఎంత మాత్రం పట్టించుకోవడంలేదంటూ ప్రజలు పోలీసుల పనితీరును విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ర్యాష్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

వెంగళరావునగర్, నవంబర్ 4: గుట్టుచప్పుడు కాకుండా హాష్ ఆయిల్ (డ్రగ్)ను విక్రయిస్తున్న ముఠాను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్‌ఆర్ నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో హాష్ ఆయిల్ విక్రయిస్తున్నారంటూ అందిన సమాచారం మేరకు మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. బోరబండకు చెందిన కె.అతుల్ సింగ్ (23), ఎం.సాయిరామ్ అలియాస్ సాయి చోట (21), బొల్లారం నివాసి వి.సచిన్ గౌడ్ (18)ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 20 హాష్ ఆయిల్ సీసాలు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బోరబండకు చెందిన కె.సాలేం రాజు, జగద్గిరిగుట్టకు చెందిన వీర హన్మంతు చారి, దీపక్ వద్ద నుంచి రూ.1500 లకు హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి, తిరిగి రూ.2 వేలకు విక్రయిస్తున్నామంటూ పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించారు. దీంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

నాన్ బెయిలబుల్ వారెంట్‌పై పాత నేరస్థుడి అరెస్ట్

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): మహిళలను వేధించడం, చీటింగ్ చేసిన నేరాలలో ఆరితేరిన పాత నేరస్థుడిని నాన్‌బెయిలబుల్ వారెంట్‌పై అరెస్ట్ చేశామని మహిళా భద్రత డీసీపీ దార కవిత తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మంద వెంకట కామేశ్‌పై ఈస్ట్‌జోన్ మహిళా పోలీస్‌స్టేషన్‌తో పాటు ఏపీలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయి. అతడిపై నాంపల్లి కోర్టు ఎన్‌బీడబ్ల్యూ జారీ చేసింది. ఈ నేపథ్యంలో పరారీలో ఉన్న నేరస్థుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు డీసీపీ తెలిపారు.

స్పోర్ట్స్ యూనివర్సిటీ, సీఎం కప్ పేర్లతో నిధుల దుర్వినియోగం

కోచ్‌ల రెగ్యులరైజ్ సమస్యను పరిష్కరించరా.!

హైదరాబాద్ ఆట ప్రతినిధి, నవంబర్ 4: క్రీడాకారులను తయారు చేసే కోచ్‌ల రెగ్యులరైజ్ సమస్యను పరిష్కరించలేని రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సహాలదారు, స్పోర్ట్స్ చైర్మన్‌లు స్పోర్ట్స్ యూనివర్సిటీ, సీఎం కప్ పేర్లతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. చిన్నారులను క్రీడాకారులుగా తయారు చేసే తెలంగాణ రాష్ట్రంలోని కోచ్‌ల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటున్నదంటూ పలువురు కోచ్‌లు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారని, అర్జున, ద్రోణాచారి అవార్డు గ్రహీతలు కోచ్‌లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఆ కోచ్‌లను రెగ్యులరైజ్ చేయకుండా ఆంధ్ర ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారంటూ కోచ్‌లు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక జీవోను విడుదల చేయాలని తెలంగాణ కోచ్‌ల సంఘం విజ్ఞప్తి చేసింది. 2003లో ఆఫ్రో ఏషియన్ గేమ్స్ నిర్వహించిన చంద్రబాబు ప్రభుత్వం.. ఆనాడు ఆర్థిక శాఖ ఉత్తర్వులతో 48 మంది కోచ్‌లను పర్మినెంట్ చేసినప్పటికీ.. నేటి వరకు ఆచరణలో పెట్టలేదన్నారు. కోచ్‌లుగా బాధ్యతలు స్వీకరించి.. చిన్నారులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అనేక పతకాలు సాధించే క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తమ వద్ద శిక్షణ పొందిన శిష్యులు కోట్ల రూపాయల నగదు బహుమతులను పొందుతుంటే.. వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు వీధులు పట్టుకొని తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వక్రీడల వేదిక ఒలంపిక్స్‌లో దాదాపు 800 గోల్డ్ మెడల్స్ ఉన్నాయని, ప్రతీ క్రీడాంశానికి ఒక కోచ్‌ను నియమిస్తే ఎనిమిది వందల మంది కోచ్‌లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి అవసరమన్నారు. 48 మంది కోచ్‌లను పర్మనెంట్ చేయడానికి 21 ఏండ్లు గడుస్తున్నా.. ఒక్క కోచ్ కూడా పర్మనెంట్ కాలేదన్నారు. వీరిలో కొంత మంది చనిపోయారని, మరికొంత మంది రిటైర్డ్ కూడా అయ్యారని పేర్కొన్నారు. కొంతమంది అధికారుల వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ నెలాఖరులో కోచ్‌లు సమ్మెకు వెళ్లాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

SPOKEN ENGLISH

★Learn Spoken English Online. Call: B.Venkateshwarloo, M.A. English. 9502699896. NT-334836

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-335088

FINANCIAL SERVICES

★Mortgage, Housing & Business from 10L Banks & Also Pvt Finance, Cibil problem files also. No Advances. Ph: 9848547871 NT-339310

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6/11 కాశీ, 16/11 కామాఖ్య, 25/11 రామేశ్వరం బస్సు, 11/12 కర్ణాటక, 21/2 కాశీ యాత్ర @ 9908844377. NT-336740

PLOT FOR SALE

★నాగార్జున సాగర్ హైవే యాచారం టౌన్‌లో గజం. రూ. 8,990/-, DTCP అప్రూవ్డ్ లేఅవుట్‌లో & కడ్తాల్ మైసిగండి దగ్గర గజం: 9,990/-. స్పాట్ రిజిస్ట్రేషన్, 25% పేమెంట్ చేసిన వారికి 500 గ్రా. సిల్వర్ ఫ్రీ. ఫోన్: 9014297729. NT-339360

★కంపెనీ వార్షికోత్సవం ఆఫర్: ఆలేరుకు అతి సమీపంలో వరంగల్ హైవే కేవలం గుంట: 2,49,999/- మాత్రమే. Ph: 7207166289. NT-339304

FLAT FOR SALE

★Kukatpally Prgt Ngr Hi-Rise 36 Floors 2BHK Flats 53L, 3 BHK 69L. ECIL Kapra indp house Gated G+2 120 Sq.yds. RS. 1.75 Cr. Rents 40K. Chegunta Plots Rs. 24L, Narketpally Plot 100 yds. 6L, Janagam Yerragollaphad 605 yds. Farm Land Rs. 4L. Narayankhed Kangti 605 yds. 6L. Cont: 9059163247. NT-332541

WANTED

jobs Apply Now!

★రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు M/F కావలెను. శాలరీ + కమీషన్, ఫ్రీ ట్రైనింగ్ (Freshers Only): 9391184511. NT-339356

★ప్రైవేట్ ఆఫీసులలో, షాపింగ్ మాల్స్‌లలో, వివిధ సంస్థలు మరియు కంపెనీలలో పని చేయుటకు కనీసం టెన్త్/ఇంటర్/ఏదైనా డిగ్రీ (పాస్/ఫెయిల్) అయిన ఆసక్తిగల అభ్యర్థులు (M/F) కావలెను. Cell: 9100479493. NT-335099

★ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు టెలికాలర్స్ శాలరీ. 10K to 15K మరియు టీం లీడర్స్ శాలరీ 50 వేల వరకు. ఇన్సెంటివ్+ అలవెన్స్ కలదు. ఫోన్: 7842520541, 9440515793. NT-339359

★సోమాజిగూడ ఏరియాలో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన డ్రైవర్లు కావలెను. మంచి జీతం కలదు, PF మరియు ESI సౌకర్యం కలదు. సంప్రదించగలరు 9154638558. NT-334541

★డ్రైవర్ అవసరం! హైదరాబాద్‌లో ఎవరెస్ట్ ఫ్లీట్ CNG కార్ డ్రైవ్ చేయండి మరియు నెలకు Rs. 25,000* సంపాదించండి!! +91 9324912075కి కాల్ చేయండి. NT-0190

CHANGE OF NAME

★I, CHALLA RAVI BABU S/o. Challa Bala Krishna Murthy, R/o. H.No. 10-156/8, PVN Colony, Malkajgiri, Hyd-47, have changed my Son's name from Challa Bala Venkata Sai Ram Chethan (Old Name) to Challa Ram Cheran (New Name) for all purpose. NT-334542

★I, GUDURI PADMA D/o. G.Laxman R/o. Plot No. 44, Vaishnoi Enclave, Petbasheerabad, Kompally, Hyderabad 500055, Telangana, have Changed my name to MADHAVI CHANDUPATLA W/o. SRINIVAS CHANDUPATLA for all future purposes. NT-339381

★I, BONDALA VENKATESHWAR REDDY, (New Name) BONDALA VENKATESHWAR RAO (Old Name). S/o. Late B.Appa Rao, R/o. H.No. 3-64/A, Plot No. 59, Road No.1, Prashanthi Hills, Phase-II, Meerpet, Balapur (M), R.R. Dist., T.S. I have changed my name from BONDALA VENKATESHWAR RAO to BONDALA VENKATESHWAR REDDY. NT-339380]

CHANGE OF NAME

★I, Sri. BAHOJU PRATAP, S/o. BAHOJU ANANDHAM, R/o. H.No. 29-1386/2/10/A, Plot No 146, Samatha Nagar, near sai Baba Temple, Near Kakatiya Nagar, Neredmet, Hyderabad-500056. Changed my name from BAHOJU PRATHAP and My Father Name from ANANDAM BAHOJU to BAHOJU PRATAP S/o BAHOJU ANANDHAM NT-339107

★I, ANUMULA SHOBHA W/o. ANUMULA SHOBHAN BABU, R/o. H.No. 3-105/7/1 Sri Lakshmi Nagar Boduppal Medipally Medchal -Malkajgiri -500039. Changed my name after my marriage from SHOBHA KONKATI to ANUMULA SHOBHA NT-339311

LOST

★I, DIVAKARUNI SAHITHYA, S/o. D SIVARAM, R/o. Flat No.302, Plot. No.38, Road No-5, Jubilee Hills, Hyderabad, Telangana - 500033. I have Lost my Passport Bearing No. P5329245, while travelling from Road No.5 Jubilee Hills to Jubilee Hills Road No.45. If anyone found please contact: 93936 38686 NT-331800

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) ప్రతి అదనపు లైనుకు రూ.75/-

పూర్తి వివరాలకు: 'నమస్తే తెలంగాణ' ప్రధాన కార్యాలయం, #8-2-603, 1/7, 8 & 9, Krishnapuram, Rd. No.10, Banjara Hills, Hyderabad-34. Cell: 9848077857

దిల్‌సుఖ్‌నగర్ : 9182777805
మల్కాజిగిరి, E.C.I.L.: 9182777125
L.B.నగర్, వనస్థలిపురం : 9182777209
ఉప్పల్, తార్నాక : 9182777806
అమీర్‌పేట్, మెహిదీపట్నం : 9182777126
B.N.రెడ్డి నగర్, సంతోష్‌నగర్ : 9182777204
కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205

కదులుతున్న 'చెక్‌మేట్' మోసాల డొంక

పరారీలో రోహిత్ ముఠా సభ్యులు

ముఠాలోని ఓ సభ్యుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

విచారణలో బయటపడిన వివరాలు

పోలీస్ స్టేషన్లకు బాధితుల క్యూ

బంజారాహిల్స్, నవంబర్ 4: మెడికల్ సీట్లు.. ఇంజినీరింగ్ సీట్లు.. బ్యాక్‌డోర్ ఉద్యోగాలు.. యూనివర్సిటీలో సీట్లు.. అంటూ అనేక మందిని నమ్మించి కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడిన 'చెక్‌మేట్' ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంస్థ అధినేత పావుల్ల రోహిత్ అలియాస్ చిన్నూ ముఠా వ్యవహారంలో పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు బయటకొస్తున్నాయి. శ్రీనగర్ కాలనీలో కొన్ని నెలలు కిందట సనత్‌నగర్ బీకేగూడ ప్రాంతానికి చెందిన రోహిత్ అలియాస్ చిన్నూ చెక్‌మేట్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ పేరుతో సంస్థను ఏర్పాటు చేశాడు. అతడి అనుచరులుగా భవానీ శంకర్, దినేశ్ అలియాస్ బిట్టూ, నదీముద్దీన్ సయీద్, కామేశ్, అచ్యుత్ తదితరులు పని చేశారు. వీరంతా తమ వద్ద నుంచి మెడికల్, ఇంజినీరింగ్ సీట్ల కోసం లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసం చేశారంటూ బాధితులు గత నెల 24న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరితో పాటు ఆఫీసు ఏర్పాటు కోసం డబ్బు అవసరం ఉందంటూ స్థానికంగా ఉంటున్న మహిళలను నమ్మించి బురిడీ కొట్టించడంతో రావి గౌతమి అనే మహిళ సైతం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వేర్వేరుగా నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన జూబ్లీహిల్స్ పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. గతంలో కూడా ఇదే తరహాలో రోహిత్ ముఠా పలు మోసాలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రోహిత్‌తో పాటు కీలకపాత్ర పోషించిన భవానీశంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అతడికి చెందిన కాల్‌డేటా, బ్యాంకు ఖాతా వివరాలను సేకరించారు. గతంలో వెంగళరావునగర్‌లో కూడా చెక్‌మేట్ కన్సల్టెన్సీ సంస్థను పెట్టి పెద్ద సంఖ్యలో బాధితులను మోసం చేసినట్టు తెలిసింది. కేసులు నమోదైన విషయాన్ని తెలుసుకున్న ప్రధాన నిందితుడు రోహిత్‌తో పాటు దినేశ్, నదీముద్దీన్, కామేశ్, అచ్యుత్, ప్రవీణ్ తదితరులు పారిపోగా.. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. రోహిత్ ముఠా చేతిలో కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలతో పాటు అనేక ప్రాంతాలకు చెందిన బాధితులు సుమారు రూ.10 కోట్లకు పైగానే మోసపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా సభ్యులు గతంలో కూడా పలు ఆర్థిక నేరాలకు పాల్పడినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. దుబాయ్ నుంచి బంగారు బిస్కెట్లు వచ్చాయని నమ్మించి కొంత మంది నుంచి డబ్బులు వసూలు చేశారని, ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే రౌడీల సాయంతో బెదిరిస్తారని సోమవారం పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ముఠా వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేపడితే అనేక మోసాలు బయటపడతాయని పోలీసులు పేర్కొన్నారు.

శ్రీనగర్ కాలనీలోని చెక్‌మేట్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంస్థ

స్కూల్ విద్యార్థులపై విచక్షణారహితంగా దాడి

పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు

చైర్మన్ కుమారుడు అభిలాష్, ఉపాధ్యాయులు రఫీపై ఫిర్యాదు

అక్టోబర్ 31న శామీర్‌పేట పీఎస్‌లో కేసు నమోదు

శామీర్‌పేట, నవంబర్ 4: ఆడుకుంటామని అడిగితే.. వాతలు వచ్చేలే కొట్టి.. ఎవ్వరికైనా చెబితే చంపేస్తామంటూ స్కూల్ యాజమాన్యం బెదిరించింది. సోమవారం పేరెంట్స్ మీటింగ్‌లో వెలుగులోకి వచ్చిన ఈ ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఘనపురం గ్రామానికి చెందిన రమేశ్ నాయక్ తన కుమారుడిని శామీర్‌పేటలోని సెయింట్ పాల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివిస్తూ.. హాస్టల్‌లో చేర్పించాడు. అక్టోబర్ నెలలో పేరెంట్స్ మీటింగ్ ఉండటంతో పాఠశాలకు వచ్చిన రమేశ్‌నాయక్.. తన కొడుకు దిగాలుగా ఉండడాన్ని గమనించి.. ఏమైనా ఇబ్బంది ఉన్నదా.. అని అడిగాడు. ఒక్కసారిగా ఆ బాలుడు బోరుమని విలపిస్తూ స్కూల్ యాజమాన్యం చేసిన ఘాతుకాన్ని వివరించాడు. మీటింగ్‌కు రెండు రోజుల ముందు స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుకుంటామని ప్రిన్సిపాల్‌ను అడగడంతో.. ఉపాధ్యాయులు, చైర్మన్ కొడుకు అభిలాష్ కలిసి విచక్షణారహితంగా దాడి చేశారంటూ వివరించి, వీపుపై ఉన్న వాతలను చూపించాడు. తనతో పాటు మరో ఆరుగుర్ని గదిలో బంధించారని చెప్పాడు. విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అక్టోబర్ 31న బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆడుకోవడం నేరమా, ఆడుకుంటామని ప్రిన్సిపాల్‌ను అడగడం ఘోరమా.. అని నిలదీశారు. విద్యార్థులపై దాడి చేసిన ఉపాధ్యాయులు రఫీ, చైర్మన్ కొడుకు అభిలాష్‌తో పాటు స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట గాయాలతో ఉన్న ఫొటోలను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు స్కూల్ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు.

శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట గాయాల ఫొటోలతో నిరసన తెలిపిన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు